సాక్షి
ప్రకాశం
ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025



ఐస్ యాపిల్..ఫుల్ చిల్

వేసవి ఎండలు మండిపోతున్నాయి. సూర్యప్రతాపాన్ని తట్టుకుని సేద తీరేందుకు తాటి ముంజలు బాగా ఉపయోగపడుతున్నాయి. మార్కెట్‌లో తాటిముంజల విక్రయాలు జోరందుకున్నాయి. - IIలో..



వేట నిషేధ భృతి ఎంతో అవసరం

చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు భృతి ఎంతో అవసరమని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. వేట నిషేధ కాలంలో భృతి పంపిణీ కార్యక్రమాన్ని మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. - IIలో..

గరిష్ఠం/కనిష్ఠం 41 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రెవెన్యూ శాఖలో బదిలీలు, పదోన్నతులు

- ఇద్దరికి తహశీల్దార్లుగా పదోన్నతి
- కనిగిరిలో సస్పెండైన అశోక్ కుమార్ రెడ్డికి పోస్టింగ్

ఒంగోలు సబర్బన్: జిల్లా రెవెన్యూ శాఖలో పలువురు తహశీల్దార్లను బదిలీ చేస్తూ, ఇద్దరికి పదోన్నతులు కల్పించారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు డీఆర్‌ఓ బీసీహెచ్.ఓబులేసు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఇద్దరికి అడహాక్ తహశీల్దార్లుగా పదోన్నతులు కల్పిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ ఉత్తర్వులను శనివారం మీడియాకు విడుదల చేశారు. కనిగిరిలో తహశీల్దార్‌గా పనిచేస్తూ గతంలో సస్పెన్షన్‌కు గురైన సీహెచ్.అశోక్ కుమార్ రెడ్డి సస్పెన్షన్‌ను ఎత్తేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. అతనిని రాచర్ల తహశీల్దార్‌గా నియమించారు. హెచ్‌ఎంపాడులో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న కేకే.కిషోర్ కుమార్‌కు అడహాక్ తహశీల్దార్‌గా పదోన్నతి కల్పించి తర్లుపాడుకు బదిలీ చేశారు. పొన్నలూరు రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న కే.వెంకటేశ్వర రావుకు అడహాక్ తహశీల్దార్‌గా పదోన్నతి కల్పించి పుల్లలచెరువు తహశీల్దార్‌గా బదిలీ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో ల్యాండ్స్-1 సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎస్ఎల్ నారాయణ రెడ్డిని మద్దిపాడు తహశీల్దార్‌గా బదిలీ చేశారు. మద్దిపాడు తహశీల్దార్‌గా పనిచేస్తున్న శ్రవణ్ ఇటీవల అవినీతికి పాల్పడటంతో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. దాంతో అరెస్టయిన తహశీల్దార్ శ్రవణ్‌ను సస్పెండ్ చేయడంతో ఆ పోస్టులో ఖాళీ ఏర్పడింది. మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఏఓగా పనిచేస్తున్న కే.రవీంద్రా రెడ్డిని సీఎస్‌పురం తహశీల్దార్‌గా బదిలీ చేశారు. సీఎస్‌పురంలో పనిచేస్తున్న డి.మంజునాథరెడ్డిని యర్రగొండపాలెం తహశీల్దార్‌గా బదిలీ చేశారు. దొనకొండ డిప్యూటీ తహశీల్దార్‌గా ఉండి ప్రస్తుతం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో ఆడిట్ టీమ్‌లో పనిచేస్తున్న జి.జగదీశ్వర రావును కలెక్టరేట్‌లోని ల్యాండ్స్-1 ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు.

నేడు మాల జేఏసీ, మాల ఉద్యోగుల సంఘ ఎన్నికలు

ఒంగోలు వన్‌టౌన్: నేడు మాల జేఏసీ, మాల ఉద్యోగుల సంఘ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో సాయంత్రం 4 గంటలకు ఎన్నికలు ప్రారంభమవుతాయన్నారు. జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్నవరపు కిషోర్ తదితరులు పాల్గొంటారన్నారు.

లక్ష టన్నుల ఇసుక అందుబాటులో ఉండాలి

ఒంగోలు సబర్బన్: జిల్లాలో నిర్మాణ అవసరాల కోసం లక్ష మెట్రిక్ టన్నులు ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మైనింగ్ శాఖ అధికారులను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం గనుల శాఖ అధికారులు, జిల్లాలోని ఆరు ఇసుక స్టాక్ యార్డుల నిర్వాహకులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అనుకున్న లక్ష్యం మేరకు ఇసుక నిల్వలు ఉంచాలన్నారు. తదుపరి ఇసుక అక్రమ రవాణా, దుర్వినియోగం, బ్లాక్ మార్కెట్ విక్రయదారులపై సంబంధిత తహశీల్దార్ల ద్వారా హెచ్చరించి క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సిందిగా ఆదేశించారు. వాగులు, వంకల నుంచి ట్రాక్టర్ల ద్వారా దూర ప్రాంతాలకు ఇసుక రవాణాను మరింత కట్టడి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గనుల శాఖ డీడీ రాజశేఖర్, ఇసుక యార్డుల నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రయాణం.. చక్ర బంధం

ఆ బస్టాండ్‌కు మూడు దశాబ్దాల చరిత్ర.. పశ్చిమ ప్రకాశానికి ముఖద్వారం..ఈ మాటలు వినటానికి ఎంతో ఘనంగా ఉన్న కనీస వసతుల్లేక ప్రయాణికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. శిథిలావస్థకు చేరిన భవనం.. పెచ్చులూడుతున్న శ్లాబు.. బస్సులొస్తే దుమ్మురేగే పరిసరాలు.. దుర్వాసనభరితమైన మరుగుదొడ్లు.. ఇదీ స్థూలంగా మార్కాపురం ఆర్టీసీ డిపో తాజా పరిస్థితి. నిత్యం వందలాది బస్సులు..వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ బస్టాండ్‌పై అధికారులు చిన్న చూపు చూస్తున్నారు. ఆదాయం పెంచుకోవడంపై చూపుతున్న శ్రద్ధ కనీస మౌలిక వసతులు కల్పించాలన్న సంగతిని విస్మరించడం గమనార్హం.



మార్కాపురం ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం

- మార్కాపురం బస్టాండ్‌లో ప్రయాణికులకు తీరని వెతలు
- డిపో ఏర్పాటై మూడు దశాబ్దాలు.. వెంటాడుతున్న సమస్యలు
- అర్ధరాత్రి సమయాల్లో డిపోకు రాని ఆర్టీసీ బస్సులు
- నిర్వహణ లోపంతో అస్తవ్యస్తంగా డిపో పరిసరాలు
- మరుగుదొడ్లు, యూరినల్స్ వద్ద భరించలేని దుర్వాసన
- బస్టాండ్‌లో క్యాంటీన్ ఏర్పాటుపై మీనమేషాలు

మార్కాపురం: మార్కాపురం బస్టాండ్ పశ్చిమ ప్రకాశం వాసులకు ఎంతో కీలకం. 1993లో బస్టాండ్‌ను ప్రారంభించారు. పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటై 32 ఏళ్లు దాటినా సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఏళ్లు గడుస్తున్నా.. పెద్ద ఎత్తున ప్రయాణికుల రాకపోకలు సాగిస్తున్నా... ఆదాయం పెరుగుతున్నా.. సౌకర్యాల కల్పనలో మాత్రం అధికారులు విఫలమవుతున్నారు. ఇప్పటికీ ఒంగోలు, కనిగిరి, హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు ప్లాట్‌ఫాం లేదు. ఫలితంగా బస్సులు ఆగినప్పుడు ఇబ్బందులు పడాల్సిందే. వర్షం పడినప్పుడు వర్షానికి తడుస్తూ, ఎండాకాలంలో ఎండకు ఎండుతూ బస్సులు ఎక్కాల్సిన దుస్థితి. డివిజన్ కేంద్రంగా ఉన్న ఇక్కడ నుంచి ప్రతి రోజు సుమారు అన్నీ ప్రాంతాలకు మార్కాపురం నుంచి 5 వేల మందికి పైగా ప్రజలు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాండులో రాత్రి, మధ్యాహ్న సమయంలో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు భోజనం చేసేందుకు క్యాంటీన్ లేకపోవడంతో బిస్కెట్లు తిని టీ తాగి కడుపు నింపుకుంటున్నారు. కొంత మంది ఆర్టీసీ డ్రైవర్లు పెద్దారవీడు మండలం కుంట, కంభం, బేస్తవారిపేట మధ్య భోజనాల కోసం బస్సులు ఆపుతున్నారు. టైం కాని టైంలో భోజనానికి ఆపినా ప్రయాణికులు తినలేక పోతున్నారు.

కనీస సౌకర్యాలు నిల్...

బస్టాండులో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు, తెలంగాణ రాజధాని హైదరాబాద్, పొరుగు జిల్లాలు కడప, నంద్యాల, కర్నూలు జిల్లాలకు ప్రతి రోజూ 1500 మంది ప్రయాణికులు వెళ్లి వస్తుంటారు. ఈ బస్సులను బస్టాండు ప్రాంగణంలోనే నిలుపుతున్నా ప్లాట్‌ఫాం లేకపోవడంతో ఎండలో నిలబడి బస్సు వచ్చిన సమయానికి ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రాంతాలకు ఆదాయం ఉన్నప్పటికీ సౌకర్యాలు మాత్రం రవాణా శాఖ అధికారులు కల్పించలేదు. ఇక బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. సరైన నిర్వహణ లేకపోవడంతో ప్రయాణికులు పే అండ్ యూజ్ టాయిలెట్స్ వాడుతున్నా వాటి నిర్వహణ కూడా మరింత అధ్వానంగా తయారైంది. బస్టాండు ఆవరణలో ఉన్న నీళ్ల ట్యాపులు కూడా అరకొరగా వస్తూ ప్రయాణికుల సహనానికి పరీక్ష పెడతాయి.



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

అర్ధరాత్రి దాటితే బస్టాండుకులోకి రాని రాయలసీమ బస్సులు

అర్ధరాత్రి దాటితే విజయవాడ నుంచి అనంతపురం, అనంతపురం నుంచి విజయవాడ మార్గమధ్యంలో ఉన్న పులివెందుల, కడప, రాయదుర్గం, హిందూపురం, నంద్యాల, బద్వేలు, ప్రొద్దుటూరు, తాడిపత్రి, ధర్మవరం, పెనుకొండ తదితర డిపోలకు చెందిన బస్సులు బస్టాండుకు రాకుండా మార్కాపురం మండలంలోని కుంట మీదుగా హైవేపై వెళ్లిపోతున్నాయి. దీంతో ఆయా ప్రాంతాలకు వెళ్లాలనుకునే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ రూట్లలో తిరిగే బస్సుల్లో ఎవరైనా మార్కాపురం పట్టణంలో దిగే ప్రయాణికులు ఉంటేనే బస్టాండుకు వస్తున్నాయి. లేకుంటే హైవేపై వెళ్లిపోతున్నాయి. ఉదయం పూట హైదరాబాద్ వెళ్లేందుకు మార్కాపురం డిపో నుంచి బస్సులు లేవు. ఉదయం 4 నుంచి 5 గంటల మధ్య హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇక్కడ నుంచి విశాఖపట్నం, అన్నవరం, సింహాచలం, రాజమండ్రికి కూడా బస్సు సౌకర్యం లేదు. విజయవాడకు వెళ్లి ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి.

హైదరాబాద్‌కు ఉదయం పూట బస్సు సౌకర్యం కల్పించాలి



మార్కాపురం బస్టాండులో ప్రయాణికుల సమస్యలు అనేకం ఉన్నాయి. వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. బస్టాండులో ప్లాట్‌ఫాంలను విస్తరించాలి. ఉదయం పూట 5 గంటలకు హైదరాబాద్‌కు, రాత్రిపూట విశాఖపట్నం, అన్నవరం, సింహాచలం, రాజమండ్రిలకు బస్సులు నడపాలి. ప్రస్తుతం శ్రీశైలం, తిరుపతి బస్సు పాత సర్వీసు కావడంతో బస్సులో కూర్చున్న ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాలకు కొత్త సర్వీసులు ఏర్పాటు చేయాలి. బెంగళూరుకు ఇంద్ర బస్సు ఏర్పాటు చేయాలి. ఆర్టీసీ బస్టాండులో క్యాంటీన్ ఏర్పాటు చేయాలి.

– అరెకేజే నరసింహం, జిల్లా ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు

సమస్యలు పరిష్కరిస్తా

మార్కాపురం బస్టాండులో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నాం. ఇటీవలే కొన్ని సమస్యలను పరిష్కరించాం. బస్సులు ఆపని డిపో మేనేజర్లతో మాట్లాడి బస్సులు మార్కాపురంలో ఆపేలా చూస్తాను. బస్సులను కూడా సక్రమంగా నిర్వహిస్తున్నాం. ఏవైనా లోటుపాట్లు ఉంటే కచ్చితంగా సరిచేస్తాను.

– ఏఎస్ నరసింహులు, డిపో మేనేజర్ మార్కాపురం

మార్కాపురం బస్టాండ్ ఏర్పాటైంది: 1993 నవంబర్ 17

బస్టాండ్ విస్తీర్ణం: 2.18 ఎకరాలు

డిపోలో బస్సుల సంఖ్య: 102

విజయవాడ- అనంతపురం హైవేతో పెరిగిన తాకిడి

విజయవాడ-అనంతపురం హైవే రోడ్డు ఏర్పాటు తరువాత ప్రయాణికుల రాకపోకలు, బస్సుల రద్దీ కూడా పెరిగింది. ఇదే సమయంలో కర్నాటక నుంచి వచ్చే లారీలు కూడా దగ్గరి మార్గంగా అనంతపురం, నంద్యాల, గిద్దలూరు, మార్కాపురం, వినుకొండ మీదుగా విజయవాడ వెళ్తున్నాయి. మార్కాపురం డిపో నుంచి రాత్రి 9 గంటలు దాటిన తరువాత విజయవాడకు నేరుగా బస్సులు లేవు. రాయలసీమ జిల్లాల నుంచి వచ్చే బస్సులు మార్కాపురం బస్టాండుకు వస్తేనే ప్రయాణికులు విజయవాడ వెళ్తున్నారు. లేకుంటే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

- రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, పార్టీ నేతలు

కనిగిరిరూరల్: పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. స్థానిక టుబాకో బోర్డులో జరుగుతున్న వేలం కేంద్రాన్ని శనివారం వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి వెళ్లి ఆయన పరిశీలించారు. బయ్యర్లు, కంపెనీ ప్రతినిధులు, బోర్డు అధికారులతో పొగాకు రైతుల సమస్యలపై దద్దాల మాట్లాడారు. పొగాకుకు గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్నామని, కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు దద్దాల నారాయణ వద్ద వాపోయారు. గిట్టుబాటు ధర కోసం పదే పదే బేళ్లను పొగాకు బోర్డు వద్దకు తీసుకుని రావడం ఇబ్బందికరంగా ఉందన్నారు. అనంతరం దద్దాల నారాయణ యాదవ్ విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు అన్ని రకాల పంటలకు మంచి గిట్టుబాటు ధరలు ఇచ్చారని గుర్తు చేశారు. గతంలో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మార్క్‌ఫెడ్ అధికారులతో, టుబాకో బోర్డు ఉన్నతాధికారులతో మాట్లాడి పొగాకు రైతులకు లాభదాయక ధరలు కల్పించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం కేజీ పొగాకు ధర రూ.360 గరిష్ఠం, కనిష్ఠం కేజీ ధర రూ.230 పలికిందని వివరించారు. నేటి కూటమి సర్కార్‌లో గరిష్ఠ ధర కనీసం రూ.280, కనిష్ఠ ధర కేజీ రూ.220కు మించడం లేదన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచనల మేరకు పొగాకు రైతులకు న్యాయం జరిగేంత వరకు, గిట్టుబాటు ధర కల్పించేంత వరకు దశల వారీ ఆందోళనలు చేపడతామని నారాయణ యాదవ్ అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చింతంగుంట్ల సాల్మన్ రాజు, మాజీ ఎంపీపీ గాయం బలరాంరెడ్డి, పోలక సిద్దారెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, కటికల వెంకటరత్నం, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, డాక్టర్ ఎస్‌కే నాయబ్ రసూల్, వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, ఎస్‌కే రహీం, జీ బొర్రా రెడ్డి, గజ్జల వెంకటరెడ్డి, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు తమ్మినేని సుజాత, అయిమోల్లా నాగమణి, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, కాస్తాల బాలాజీ, పోతిరెడ్డి రాజశేఖరరెడ్డి, తూము వెంకట కృష్ణారెడ్డి, నాగేంద్రారెడ్డి, ఆవుల తిరుపతిరెడ్డి, యర్రబల్లి దేవరాజ్, ఖాశింసా, గూడూరి అనీల్ కుమార్, షంషీర్, పరిమి వెంకట్రావ్, ప్రసాద్‌రెడ్డి, ఉమా శంకర్‌రెడ్డి, పలుకూరి భాస్కర్, చింతంగుంట్ల కిషోర్, ఎస్ వెంకటేశ్వర్లు చౌదరి, షకీలా, భారతీ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణదాతలుగా పశువైద్యులు

- ప్రపంచ వెటర్నరీ డే కార్యక్రమంలో కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: మూగజీవాల పాలిట ప్రాణదాతలుగా పశు వైద్యులు అందిస్తున్న వైద్య సేవలు అభినందనీయమని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. శనివారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగిన ప్రపంచ పశువైద్య దినోత్సవంలో కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలుత పహల్గాంలో ఈనెల 22న ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. అనంతరం ప్రపంచ పశు వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా విజన్ డాక్యుమెంట్‌లో లైవ్ స్టాక్ సెక్టార్ రూ.9,735 కోట్ల జీడీపీతో మొదటి స్థానంలో ఉందన్నారు. అలాగే పాల ఉత్పత్తిలో రాష్ట్రంలో 5వ స్థానంలో ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 17,525 కుటుంబాలు పేదరికంలో ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం పి-4 విధానంలో వీరిని అభివృద్ధి చేసేలా 15 శాతం వృద్ధి రేటుతో ప్రణాళికలు రూపొందించినట్లు కలెక్టర్ చెప్పారు. పాడి పరిశ్రమలో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు అధికారులు తమ వంతు కృషి చేయాలన్నారు. పశు సంవర్ధక శాఖ సిబ్బందికి నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు కలెక్టర్ మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, పశు సంవర్ధక శాఖ జేడీ డా.బేబీ రాణి, పశు సంవర్ధక శాఖ మార్కాపురం, ఒంగోలు ఉపసంచాలకులు డాక్టర్ రాఘవయ్య, డాక్టర్ రమేష్ బాబు, జిల్లా బహుళార్థ పశు వైద్యశాల ఉపసంచాలకులు డాక్టర్ జగత్ శ్రీనివాసులు, ఐఎస్‌డీపీ సహాయ సంచాలకులు డాక్టర్ వెంకట రామిరెడ్డి, త్రోవగుంట ఏడీ బనవ శంకర్, జిల్లా పశువైద్యాధికారులు సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బత్తుల బాలకృష్ణ, కోశాధికారి డాక్టర్ చంద్ర శేఖర్, రిటైర్డ్ పశు వైద్యాధికారులు డాక్టర్ తాతారావు, డాక్టర్ ఏసురత్నం, డాక్టర్ సోమయ్యతో పాటు వైద్యులు పాల్గొన్నారు.

పాత్రధారులు ఓకే.. సూత్రధారులు మిగిలారు..

- హంతకులు నలుగురూ జిల్లా వాసులే..
- వారి కోసం విస్తృతంగా గాలింపు
- స్విచ్ఛాఫ్‌లో నిందితుల ఫోన్లు
- వారి బంధువులను సైతం విచారిస్తున్న పోలీసులు
- సంతనూతలపాడు వద్ద రెండో వాహనం స్వాధీనం
- శనివారం బైక్‌పై ఎస్పీ తనిఖీలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసు విచారణ ముమ్మరంగా సాగుతోంది. గత మంగళవారం హత్య జరిగినప్పటి నుంచి అనేక ఊహాగానాలు ప్రచారంలోకి వచ్చాయి. తొలుత లిక్కర్ మాఫియా నేపథ్యంలో హత్య జరిగిందని ప్రచారం జరిగింది. ఆ తర్వాత బియ్యం తగాదాల గురించి చర్చకు వచ్చింది. ఈ లోపు భూ వివాదాలు తెరమీదకు వచ్చాయి. రామాయపట్నం భూములని, వైజాగ్‌లోని రియల్ మాఫియా తగాదాలని, బెంగళూరు, హైదరాబాద్‌ల్లో భూ వివాదాలని రకరకాలుగా ప్రచారం జరిగింది. అంతేకాకుండా హంతకులు స్థానికులు కాదని, బీహారీలని సైతం అనుమానాలు వ్యక్తమయ్యాయి. తొలుత పోలీసులు కూడా ఆ దిశగానే దర్యాప్తు చేశారు. మొత్తం 12 బృందాలు జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రాలకు సైతం వెళ్లాయి. వీరయ్య చౌదరితో వ్యక్తిగత విభేదాలున్న వారందరినీ అదుపులోకి తీసుకున్నారు. రైస్ వ్యాపారులతో పాటుగా లిక్కర్, రియల్ వ్యాపారులను అనేక మందిని అదుపులోకి తీసుకొని విచారించారు. హత్య జరిగిన తరువాత మూడు రోజుల పాటు పురోగతి కనిపించలేదు. ఎలాంటి కీలక ఆధారాలు లభ్యం కాలేదు. చీమకుర్తి దగ్గర ఎప్పుడైతే నిందితులు ఉపయోగించిన స్కూటీ దొరికిందో ఒక్కసారిగా విచారణ వేగం పుంజుకుంది. హత్య కేసులో అమ్మనబ్రోలుకు చెందిన టీడీపీ యువ నేతను కీలక అనుమానితుడిగా భావించి విచారణ చేస్తున్నారు. అలాగే అమ్మనబ్రోలుకు చెందిన వ్యాపారి పాత్రపై కూడా ఆధారాలను సేకరిస్తున్నారు. ఇందు కోసం ఒక బృందం హైదరాబాద్‌కు వెళ్లినట్టు తెలిసింది. అలాగే సంతనూతలపాడు టీడీపీ వాట్సప్ గ్రూప్‌లో వీరయ్య చౌదరిని ఉద్దేశించి పెట్టిన పోస్టులు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.



వీరయ్య చౌదరి (ఫైల్)

రెండో వాహనం కూడా స్వాధీనం..

వీరయ్య హత్య కేసులో నిందితులు ఉపయోగించిన మోటారు బైకును సంతనూతలపాడులో శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే మోటారు బైకు యజమాని ఎవరు, ఎక్కడి వ్యక్తి అనే విషయాలు ఇంకా తెలియరాలేదు. శుక్రవారం చీమకుర్తి జాతీయ రహదారి పక్కన ఉన్న ఒక దాబా వద్ద స్కూటీని స్వాధీనం చేసుకోవడం తెలిసిందే. దీంతో హత్య కేసులోని రెండు వాహనాలు దొరికినట్టేనని చెప్పవచ్చు. స్కూటీ దొరికిన తరువాత విచారణ ఊపందుకున్నట్లే, మోటారు బైకును స్వాధీనం చేసుకున్న తరువాత మిగిలిన నిందితులంతా ఎక్కడివారనేది తేలినట్లు సమాచారం.

హంతకులు నలుగురూ జిల్లా వారే...

హత్యలో మొత్తం నలుగురు పాల్గొన్నట్లు పోలీసులు మొదట్నుంచి చెబుతున్నారు. ఇప్పటి వరకు ఆ నలుగురు ఎవరనే దాని మీద రకరకాల చర్చ జరిగింది. భారీ మొత్తంలో సుపారీ ఇచ్చి హత్య చేయించారని ప్రచారం సాగింది. పొన్నూరు నుంచి కూడా కొంత మందిని అదుపులోకి తీసుకొని విచారించారు. చివరికి తేలిందేమిటంటే హంతకులంతా జిల్లాకు చెందిన వారేనని పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. నగరంలోని కొప్పోలు ప్రాంతానికి చెందిన వ్యక్తి హత్యలో కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. స్వయంగా అతడు హత్యలో పాల్గొన్నట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అతడితో పాటు మిగిలిన ముగ్గురు కూడా జిల్లాకు చెందిన వారేనని సమాచారం. వీరంతా ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వీరికి సంబంధించిన మొబైల్ ఫోన్లు స్విచాఫ్ వస్తున్నట్లు తెలుస్తోంది. హత్య జరిగిన రోజు రాత్రే వీరు పరారయ్యారు. చీమకుర్తిలోని జాతీయ రహదారిపై పోలీసుల హడావుడి కనిపించడంతో దానికి కొద్ది సమీపంలోనే ఒక దాబా వద్ద నిందితులు స్కూటీని నిలిపివేసి కనిగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కి పొదిలి వైపు వెళ్లినట్లు సీసీ కెమెరాలలో రికార్డయింది. ఇద్దరు పొదిలి వైపు వెళ్లినట్లు గుర్తించారు. మిగతా ఇద్దరు ఎటు వెళ్లారన్న దాని మీద స్పష్టమైన సమాచారం లేదని తెలుస్తోంది. వైజాగ్ వెళ్లినట్లు పోలీసులు భావిస్తున్నా హైదరాబాద్, కర్నూలు వైపు వెళ్లినట్టు కూడా ప్రచారం జరుగుతోంది. అయితే ఆ నలుగురు దొరికితే వారి వెనక ఉన్న సూత్రధారుల గుట్టు రట్టవుద్దని పోలీసులు భావిస్తున్నారు.

వివిధ ప్రాంతాల్లో పోలీసుల గాలింపు...

వీరయ్య చౌదరి కేసులో ఒంగోలు పోలీసులు బృందాలుగా విడిపోయి విస్తృతంగా గాలిస్తున్నారు. బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లిన బృందాలు సాంకేతిక సమాచారాన్ని వినియోగించుకొని వేట కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. అయినా పోలీసులకు ఎలాంటి ఆధారాలు దొరకలేదని సమాచారం. ఈ హత్యలో పాల్గొన్న కీలక నిందితుని తల్లిదండ్రులను, భార్యను పోలీసు స్టేషన్‌కు తరలించి విచారించారు. వారితో నిందితుడు టచ్‌లో ఉన్నట్లు ఏమైనా ఆధారం దొరుకుతుందేమోనని ప్రయత్నం చేశారు. వారి నుంచి ఎలాంటి క్లూ లభించకపోవడంతో వారిని వదిలిపెట్టినట్లు సమాచారం.

నగరంలో పోలీసుల విస్తృత తనిఖీలు:

నగరంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లతో పాటు షాపింగ్ మాళ్లు, వ్యాపార వాణిజ్య భవనాలను పూర్తిగా తనిఖీలు చేశారు. ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్లు, సినిమా హాళ్లు, హోటళ్లు, లాడ్జీలను ఒక్కదాన్ని కూడా వదిలిపెట్టలేదు. ఈ తనిఖీలలో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ పాల్గొనడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

బైకు మీద ఎస్పీ గాలింపు చర్యలు:

వీరయ్య చౌదరి హత్య కేసులో నిందితులను పట్టుకునేందుకు ముమ్మరంగా చర్యలు చేపట్టారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఎస్పీ ఏఆర్ దామోదర్ స్వయంగా మోటారు బైకు మీద తిరుగుతూ గాలింపు చర్యలను పర్యవేక్షించారు. నిందితులు తలదాచుకునేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామ శివారు ప్రాంతాల్లో కూడా తిరిగారు. నిందితులను పట్టుకునేందుకు తీసుకుంటున్న చర్యలను ముమ్మరం చేయాల్సిందిగా పోలీసు అధికారులను ఆదేశించారు. అలాగే ఎలాంటి సమాచారం లభించినా పోలీసులకు తెలియజేయాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.



ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు సిటీ: ఉచిత విద్యాహక్కు చట్టం–2009 ప్రకారం 2025–26 విద్యా సంవత్సరంలో జిల్లాలోని అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం కోటా కింద పిల్లలకు ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఏ కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి మే నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీ:// ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగుల కోసం 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాలకు (బీసీ, మైనార్టీ, ఓసీ) చెందిన పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే లాటరీ ద్వారా సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. ఎవరికైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబర్ 18004258599ను సంప్రదించవచ్చన్నారు. అడ్మిషన్ కోసం తల్లిదండ్రులు, పిల్లల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. సీబీఎస్ఈ, ఐబీ, ఐసీఎస్ఈ బడుల్లో ప్రవేశాలకు 2025 మార్చి 31 నాటికి పిల్లలకు ఐదేళ్లు పూర్తయి ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సిలబస్ పాఠశాలల్లో జూన్ 1 నాటికి ఐదేళ్లు నిండి ఉండాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల డేటా ఆధారంగా మే 16 నుంచి 20వ తేదీ వరకు విద్యార్థుల ప్రవేశానికి అర్హతలు నిర్ణయిస్తారన్నారు. లాటరీ ద్వారా మొదటి విడత ఫలితాలను మే 21 నుంచి 24వ తేదీ మధ్య విడుదల చేస్తారని తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థుల ప్రవేశాల నిర్ధారణను విడతల వారీగా జూన్ 2, 6, 12 తేదీల్లో విడుదల చేస్తారని చెప్పారు.

విలువలతో కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలు

● మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి రాజ్యలక్ష్మి



బాలసదన్‌ను పరిశీలిస్తున్న మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి రాజ్యలక్ష్మి

ఒంగోలు సిటీ: చిన్నతనం నుంచే విలువలతో కూడిన విద్య, క్రమశిక్షణ వలన జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి టి.రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం ఒంగోలులోని బాలసదన్‌ను ఆమె సందర్శించారు. అక్కడి విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన సదుపాయాలను పరిశీలించారు. బాలసదన్‌కు సంబంధించిన దస్త్రాలు, కార్యాలయ నిర్వహణ తీరును పరిశీలించారు. మరింత మెరుగైన సదుపాయాల కోసం సూచనలు చేశారు. చట్టపరంగా విద్యార్థులకు అవసరమైన న్యాయ సహాయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తోందని తెలిపారు. తదనంతరం శిశుగృహను న్యాయమూర్తి సందర్శించి అక్కడి నవజాత శిశువుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.హేమలత, జూనియర్ సివిల్ న్యాయమూర్తి కే నికిత, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ దినేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఐస్ యాపిల్.. ఫుల్ చిల్.!



● మండుటెండలకు తాటిముంజలతో సేద తీరుతున్న ప్రజలు
● పెరిగిన డిమాండ్, ధరలు ● పదికి మూడే ముంజలు
● అన్ని ధరలు మాదిరిగానే ఇవి కూడా పెరిగాయంటున్న విక్రయదారులు



గంపలో నోరూరిస్తున్న తాటిముంజలు

కనిగిరి రూరల్: వేసవి ఎండలు మండిపోతున్నాయి. సూర్యప్రతాపాన్ని తట్టుకునేందుకు సేదతీరే మార్గాల కోసం ప్రజలు అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో అందుబాటులోకి వచ్చిన తాటి ముంజలకు డిమాండ్ బాగా పెరిగింది. వీటిని ఐస్ ఆపిల్‌గా కూడా పిలుస్తుంటారు. ఎండల నుంచి కాస్త ఉపశమనం పొందడానికి తాటి ముంజలు ఎంతో ఉపయోగపడతాయి. దీంతో వారం రోజులుగా కనిగిరి, మార్కాపురం, ఒంగోలు, తదితర ప్రాంతాల్లో తాటిముంజల అమ్మకాలు జోరందుకున్నాయి. ఆయా పట్టణాల్లోని ప్రధాన సెంటర్లలో వీటిని విక్రయిస్తుండగా, కొనుగోలుదారులు ఎగబడుతున్నారు. కనిగిరి పట్టణంలోని నాజ్ సెంటర్, ఒంగోలు బస్టాండ్ సెంటర్, పామూరు బస్టాండ్, చర్చి సెంటర్లలో, ఒంగోలులోని నెల్లూరు బస్టాండ్, కోర్టు సెంటర్, కర్నూలు రోడ్డులో, మార్కాపురంలోని పలు ప్రాంతాల్లో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. కొందరు విక్రయదారులు కాయల నుంచి ముందుగానే ముంజలను బయటకు తీసి గంపల్లో అమ్ముతుండగా, మరికొందరు నేరుగా తాటి కాయలు తెచ్చి కొనుగోలుదారుల ఎదురుగానే ముంజలు తీసి విక్రయిస్తున్నారు.

గతంలో కంటే పెరిగిన ధరలు...

గతంలో పది రూపాయలకు పది తాటిముంజలు విక్రయించేవారు. వేసవి సీజన్‌లో పదికి ఐదారు ఇచ్చేవారు. ఈసారి సీజన్ ప్రారంభం నుంచే పది రూపాయలకు మూడు ముంజలు మాత్రమే ఇస్తున్నారు. దిగుబడి సరిగ్గా లేదని, ఎంతో కష్టపడి కోసి తెస్తే కనీసం కూలి కూడా గిట్టుబాటు కావడం లేదని విక్రయదారులు చెబుతున్నారు. అంతేగాకుండా గతేడాది కంటే ఈ ఏడాది నిత్యావసరాల ధరలు పెరిగాయని, అవి పెరిగినప్పుడు ఇవి పెరగవా..? లేకుంటే మేమెలా బతకాలని అంటున్నారు. నిర్మొహమాటంగా వారి బాధను, కష్టాన్ని తాటిముంజల విక్రయదారులు వెలిబుచ్చుతున్నారు.



కనిగిరిలో రోడ్డు పక్కన తాటిముంజల విక్రయాలు

ఆరోగ్యపరంగా ఎంతో ఉపయోగం...

తాటి ముంజలు ఆరోగ్యపరంగా ఎంతో ఉపయోగమని, అనేక రకాల రుగ్మతలకు దివ్య ఔషధంగా దోహదపడతాయని పలువురు పెద్దలు చెబుతున్నారు. రక్తపోటు అదుపులో ఉంచడానికి, చెడు కొలస్ట్రాల్ తగ్గించడానికి, శరీరంలో వ్యర్థ పదార్థాలను బయటకు పంపేందుకు, శరీరంలో తేమ శాతం పెంచడానికి, వేసవిలో వచ్చే చికెన్ ఫాక్స్ వ్యాధిని తగ్గించడానికి ముంజలు ఎంతగానో ఉపయోగపడాయని అంటున్నారు. దీంతో వాటిని కొనుగోలు చేసేందుకు ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు.

హెచ్‌ఎం పాడు టు కనిగిరి...

కనిగిరి నియోజకవర్గంలోని సీఎస్ పురం, హెచ్‌ఎం పాడు మండలాల్లో ఎక్కువగా తాటి చెట్లు ఉన్నాయి. అయితే, హెచ్‌ఎం పాడు మండల వాసులే ఎక్కువగా తాటి ముంజల విక్రయాలు చేస్తుంటారు. ఇక్కడ దాదాపు అన్ని గ్రామాల్లో ప్రభుత్వ, అసైన్డ్, ఫారెస్ట్ భూముల్లో తాటిచెట్లు ఉన్నాయి. కోతకు వచ్చే సమయంలో తాటిచెట్లను విక్రయదారులు వేలం పాట ద్వారా, చెట్ల లెక్కన కొనుగోలు చేసి సీజన్ అయ్యేదాక వాటిని కొట్టుకుని విక్రయిస్తుంటారు. హెచ్‌ఎం పాడు మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, నందనవనం, వాలిచర్ల, హెచ్‌ఎం పాడు తదితర గ్రామాలకు చెందిన వ్యక్తులు ఎక్కువగా తాటి ముంజలను పట్టణాలకు తెచ్చి విక్రయిస్తున్నారు. అదేవిధంగా మార్కాపురం పట్టణానికి ఎక్కువగా కొనకనమిట్ల ప్రాంతం నుంచి, ఒంగోలు నగరానికి కొత్తపట్నం మండలం నుంచి తాటిముంజలు తీసుకొచ్చి విక్రయాలు చేస్తున్నారు.



మార్కాపురంలో తాటికాయల నుంచి ముంజలు తీయించి కొనుగోలు చేస్తున్న ప్రజలు

వేట నిషేధ భృతి ఎంతో అవసరం

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



మత్స్యకారులకు భృతి చెక్కు అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, తదితరులు

ఒంగోలు సబర్బన్: చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు భృతి ఎంతో అవసరమని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. సముద్రంలో చేపల వేట నిషేధ కాలంలో భృతి పంపిణీ కార్యక్రమాన్ని ఒంగోలు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శనివారం మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఏటా 2 నెలల పాటు ఉండే చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకార కుటుంబాల జీవనం కోసం ఇచ్చే భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచినట్లు తెలిపారు. మెగా చెక్కును మత్స్యకారులకు అందజేశారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 2025–26 సంవత్సరానికిగానూ 5,501 మంది సముద్ర మత్స్యకారులకు ఒక్కో కుటుంబానికి ఇరవై వేల రూపాయల చొప్పున మొత్తం పదకొండు కోట్ల ఇరవై వేల రూపాయల లబ్ధి చేకూరనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని కొత్తపట్నం, ఒంగోలు, టంగుటూరు, సింగరాయకొండ, నాగులుప్పలపాడు మండలాలకు చెందిన మత్స్యకారులకు ఈ భృతిని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు పేరయ్య, మత్స్యకార సంఘాల ప్రతినిధులు తిరుపతిరావు, సున్నం తిరుపతి, రాయం శ్రీనివాసరావు, వివిధ మత్స్య కార సంఘాల ప్రతినిధులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

జిల్లాలో పోలీసుల ముమ్మర తనిఖీలు

ఒంగోలు టౌన్: జిల్లాలో ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు పోలీసులు శనివారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని హోటళ్లు, లాడ్జిలు, రైల్వే, బస్ స్టేషన్లను తనిఖీ చేశారు. లాడ్జిలలో బసచేసిన వారి ఆధార్, ఇతర వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు. అనుమానాస్పదంగా ఉన్న వారి ఫింగర్ ప్రింట్స్ తీసుకున్నారు. అనుమానాస్పద వ్యక్తులు లాడ్జిలలో బసచేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని యజమానులకు స్పష్టం చేశారు. ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు తావిచ్చినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు ప్రదేశాలలో డాగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది. వాహనాలను తనిఖీ చేసి రోడ్డు భద్రత ఉల్లంఘనదారులపై ఎంవీ చట్టం ప్రకారం చర్యలు తీసుకున్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ మద్యం, గంజాయి వంటి మాదక ద్రవ్యాల రవాణా జరగకుండా తనిఖీలు నిర్వహించారు.



సింగరాయకొండలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మద్దిపాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మద్దిపాడు మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి జాతీయ రహదారిపై ఒంగోలు వైపు నుంచి మేదరమెట్ల వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం మద్దిపాడు మండల పరిధిలోని దొడ్డవరప్పాడు భారత్ పెట్రోలియం బంక్ సమీపంలో ఒక వ్యక్తిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాపట్ల జిల్లా అద్దంకి మండలం నాగులపాడు గ్రామానికి చెందిన మందపల్లి శ్రీహరి (35) అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలాన్ని స్థానిక ఎస్సై బి.శివరామయ్య పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు.

కళాకారులను ప్రభుత్వాలు ఆదుకోవాలి



కందుకూరి విశిష్ట పురస్కార గ్రహీత మల్లికార్జునరావును సన్మానిస్తున్న పలు సంస్థల నిర్వాహకులు

● ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు

ఒంగోలు మెట్రో: కళాకారులను ప్రభుత్వాలు ఆదుకోవాలని ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు అన్నారు. ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూం ఆవరణలో శ్రీ నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అండ్ అసోసియేషన్ సంస్థ ఆధ్వర్యంలో కందుకూరి విశిష్ట పురస్కారాన్ని అందుకున్న ప్రముఖ నటుడు మిడసల మల్లికార్జునరావుకు శనివారం అభినందన సభ నిర్వహించారు. కనమాల రాఘవులు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా పాల్గొన్న నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కళాకారులను ప్రభుత్వాలు గుర్తించి పురస్కారాలివ్వడం, అందులోనూ మిడసలకు పురస్కారం లభించడం అభినందనీయమని అన్నారు. ప్రముఖ నటుడు డాక్టర్ పరాంకుశం కేశవాచార్యులు మాట్లాడుతూ పౌరాణిక నాటకాలను ప్రజలు మెచ్చే విధంగా చేయడం, చేయించడంలో మిడసల అభినందనీయుడని కొనియాడారు. నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘ గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, కళామిత్ర మండలి (తెలుగు లోగిలి) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు, తదితరులు పాల్గొని మిడసలను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సీవీఎన్ రీడింగ్ రూమ్ క్లబ్ అధ్యక్షుడు ఈదుపల్లి గురునాథం, కార్యదర్శి కె.రాధాకృష్ణ, కోశాధికారి ఆరిగ వీరప్రతాప్, సింహాద్రి జ్యోతిర్మయి, యు.వి.రత్నం, కొప్పోలు వెంకటేశ్వర్లు, మెడబలిమి సాంబశివరావు, దామవరపు మునలయ్య, కోవెలకుంట్ల బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు. ముందుగా రాజేష్ దంపతులు పాడిన పాటలు, చందూ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

జామాయిల్ తోట దగ్ధం

● రూ.4 లక్షల ఆస్తినష్టం



అగ్ని ప్రమాదానికి గురైన జామాయిల్ తోట

ముండ్లమూరు (కురిచేడు): ముండ్లమూరు మండలంలోని పోలవరం గ్రామంలో జామాయిల్ తోట దగ్ధమై సుమారు రూ.4 లక్షల ఆస్తినష్టం సంభవించింది. తోట యజమాని అనుపర్తి జాన్‌ప్రభాకర్ కథనం మేరకు.. రెండు ఎకరాల్లో జాన్‌ప్రభాకర్ జామాయిల్ తోట సాగు చేశాడు. శుక్రవారం రాత్రి అగ్నికి తోట ఆహుతైంది. చేతికందే సమయంలో జామాయిల్ తోట అగ్నిప్రమాదానికి గురికావడంతో సుమారు రూ.4 లక్షల మేరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా నిప్పంటించారా.. లేక బీడీ, సిగరెట్ తాగి పడేస్తే గాలికి అగ్గి రాజుకుని ప్రమాదం జరిగిందా..? అనే విషయం తెలియడం లేదన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

కురిచేడు: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సంధ్య వాటర్ సర్వీసింగ్ పాయింట్‌ను కూల్చివేసి దాని యజమాని కే మరియబాబును దుర్భాషలాడిన ఘటనపై కురిచేడు పోలీసుస్టేషనులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.శివ శనివారం తెలిపారు. మరియబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదకోటిరెడ్డి, పత్తి శ్రీరంగ, అతని తమ్ముడిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పర్యాటకులపై ఉగ్రదాడి సిగ్గుచేటు

మార్కాపురం: జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు పర్యాటకులపై విచక్షణా రహితంగా కాల్పులు జరపడం అమానుషమని ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణ అన్నారు. జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ శనివారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమాయకులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపి పైశాచిక ఆనంద పొందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐజేయూ మాజీ సభ్యుడు కేవీ సత్యనారాయణ, జీఎల్ నరసింహారావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు డీ మోహన్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే బాజీవలి, యూనియన్ జిల్లా కోశాధికారి డీ బాబి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీయూడబ్ల్యూజే సభ్యులు

ముండ్లమూరు చిన్నారికి గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు



గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు అవార్డు అందుకుంటున్న మణిరత్నపాల్ నిధి

ముండ్లమూరు (కురిచేడు): సంగీతంలో ఓ పదకొండేళ్ల చిన్నారి గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించాడు. ముండ్లమూరు పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.ప్రేమానిధి కుమారుడు మణిరత్నపాల్ నిధి ఈ రికార్డు సొంతం చేసుకున్నాడు. విజయవాడ హలెల్ మ్యూజిక్ స్కూలు ద్వారా సంగీతం నేర్చుకున్నాడు. గత డిసెంబరు నెలలో డీ అగస్టీన్ ఆధ్వర్యంలో 18 దేశాలలో 1,046 మందితో జరిగిన గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు పోటీల్లో పాల్గొన్నాడు. తన స్వరాలు ఆలపించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సొంతం చేసుకున్నాడు. విజయవాడలోని మెట్రోపాలిటన్ మిషన్ చర్చిలో శుక్రవారం గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డును హలెల్ మ్యూజిక్ స్కూలు అధినేత డీ అగస్టీన్ దంపతుల చేతుల మీదుగా అందుకున్నాడు.



గిన్నిస్‌బుక్ సర్టిఫికెట్ అందుకుంటున్న జాషువా

గిన్నిస్ బుక్‌లో జాషువా పేరు నమోదు

మార్కాపురం: మార్కాపురం జీజీహెచ్‌లో డయాలసిస్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న దారా జాషువా అలియాస్ కుమార్ గిన్నిస్ బుక్ రికార్డులో పేరు నమోదు చేసుకున్నారు. గతేడాది డిసెంబరు 1న విజయవాడలో జరిగిన ప్రపంచ స్థాయి సంగీత ప్రదర్శనలో హలెల్ మ్యూజిక్ స్కూల్ సంగీత కళాకారుల బృందం ఆధ్వర్యంలో జాషువా కీ బోర్డులో స్వరాలను 45 సెకన్లలో స్వరపరిచి గంటలో 1046 వీడియోలు అప్లోడ్ చేయడం ద్వారా ఈ ఘనత సాధించారు. ఈ నెల 25న విజయవాడలో జరిగిన గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రతినిధుల సమక్షంలో పాస్టర్ అగస్టీన్ చేతుల మీదుగా మెడల్, గిన్నిస్ ధ్రువీకరణపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను చర్చి సభ్యులు, క్రైస్తవ సంఘాల సభ్యులు అభినందించారు.